ప్రకాశం జిల్లా తేది:12.04.2024

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ. ఏ.ఎస్.దినేష్ కుమార్ చెప్పారు. జిల్లాలోని ఓటర్లు, వారి కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ విధుల కోసం సిబ్బంది కేటాయింపు-శిక్షణ, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేలా తరలిస్తున్నట్లుగా గుర్తించిన డబ్బు-వస్తువుల స్వాధీనం, తదితర విషయాలలో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను శుక్రవారం కలెక్టరేట్లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఎస్.పి. శ్రీ.గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ శ్రీ.ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరించారు.

జిల్లాలో ఈ నెల 11వ తేదీ నాటికి మొత్తం 18,17,162 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు ఈ నెల 11వ తేదీ నాటికి 5,389 పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో 3,33,463 ఫోటో ఓటరు గుర్తింపు కార్డులు జనరేట్ కాగా, వాటిలో 3.25,451 కార్డులను రిజిస్టర్ పోస్టు ద్వారా ఓటర్లకు పంపించామన్నారు. ప్రింటర్ల నుంచి మరో 6,861 కార్డులు రావాల్సి ఉందన్నారు. కాగా పోస్టాఫీస్ నుంచి డెలివరీ కాకుండా 1,151 కార్డులు వెనక్కి వచ్చాయని, వీటిని బి.ఎల్.ఓ. ల ద్వారా ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. ఎపిక్ కార్డులు లేని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల ఇతర గుర్తింపు కార్డులను చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు.

ఒంగోలులోని రైజ్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. కాగా, ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేకంగా మధ్యంతర (ఇంటర్మీడియట్) స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశామన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి మార్కాపురంలో గుర్తించామన్నారు. దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు స్థానికంగానే మధ్యంతర స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశామన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ నెల 12వ తేదీన మొదటి విడత ఈ.వి.ఎం.ల ర్యాండమైజేషన్ నిర్వహించామని, ఈ నెల 13,14 తేదీలలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజక వర్గాలకు ఈ.వి.ఎం.లను పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు ఎన్నికలకు సంబంధించి వివిధ రకాల

పనుల పర్యవేక్షణ కోసం 16మంది నోడల్ ఆఫీసర్లను జిల్లా స్థాయిలోనూ, నియోజకవర్గ స్థాయిలోనూ నియమించామని చెప్పారు. జిల్లా స్థాయిలో 08592 288599 నెంబర్ తో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఉద్యోగులు, వాలంటీర్లు, రాజకీయ పార్టీల సమావేశాల విషయంలో జిల్లాలో ఇప్పటివరకు ఎం.సి.సి. ఉల్లంఘనకు సంబంధించి 129 వార్తలు పత్రికల్లో వచ్చాయని, వాటిలో 119 కథనాలకు సంబంధించిన నివేదికలను సి.ఈ.ఓ ఆఫీసుకు పంపించామన్నారు. జిల్లాలో 41 మంది వాలంటీర్లను, 11 మంది కాంట్రాక్టు ఉద్యోగులను

తొలగించామని, నలుగురు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశామని, మరో నలుగురిపై క్రమ శిక్షణా చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన మరియు శాంతి భద్రతలకు విఘాతం కల్పించినందుకు జిల్లాలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పైన 11, తెలుగుదేశం పార్టీ పైన 3, ఈ రెండు పార్టీల పైన కలిపి ఒక కేసు, ఇతరులపైన ఒక కేసు నమోదయినట్లు కలెక్టర్ చెప్పారు.

జిల్లాలో షుమారు 32,000 మందికి పోస్టల్ బ్యాలెట్లు అవసరమని గుర్తించినట్లు చెప్పారు. వీరిలో సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది, అత్యవసర సేవలలో పాల్గొనే సిబ్బంది, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు మరియు వికలాంగుల కోసం హోమ్ ఓటింగ్ కోసం పోస్టల్ బ్యాలెట్లు అవసరమవుతున్నాయన్నారు.

ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అనుమతి కోసం సువిధ యాప్ లో ఇప్పటివరకూ 848 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 590 దరఖాస్తులకు అనుమతి ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. ప్రచార తేదీ, సమయం, ప్రదేశం, తదితర విషయాలను ప్రస్తావించక పోవడం వలన 145 తిరస్కరించామని, 88 పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.

సి-విజిల్ యాప్ లో ఇప్పటివరకూ 454 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 94 శాతం ఫిర్యాదులను 100 నిముషాలలోపే పరిష్కరించామన్నారు. ఒక్కో ఫిర్యాదును సగటున 38 నిముషాలలో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఇప్పటి వరకూ రూ.1.30 కోట్ల విలువైన డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు, విలువైన ఆభరణాలు, వస్తువులను సీజ్ చేశామని కలెక్టర్ చెప్పారు.

నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి సందేహ నివృత్తి చేయడానికి ఈ నెల 15వతేదీ నుంచి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్రకాశం జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ దిశగా 127 ఫ్లాగ్ మార్చ్లు, 359 అవగాహనా సమావేశాలు, 18 చెకోపోస్టు, 24 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 240 బృందాలతో రాత్రింబవళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. చెడు ప్రవర్తన కలిగిన 831 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి 6,596 మందిని బైండోవర్ చేశామని, గత ఆరు నెలల్లో మొత్తం 14,054 మందిని బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో ఉన్న ఆయుధాలను అన్నీ డిపాజిట్ చేశారని, నాన్-బెయిలబుల్ వారెంట్స్ను ఎగ్జిక్యూట్ చేయడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ గారు కోరారు. ఒంగోలు రిమ్స్ హాస్పటల్లో జరిగిన ఘటన పై రిమ్స్ డ్యూటీ డాక్టరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని, సమగ్ర దర్యాప్తు చేసి 39 మంది వ్యక్తులను గుర్తించి వారిలో 20 మందికి

నోటీసులు అందజేయడం జరిగిందని, మిగిలిన వారికి కూడా నోటీసులు అందజేయవలసి ఉన్నదన్నారు. మిగతా రెండు కేసులలో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ గారు తెలిపారు.





